


## జడ్జి జగన్నాథం

రేపే తీర్పు చెప్పాల్సి ఉంది ఆ కేసులో.

చాలా చిత్రమైన కేసు. ఇన్నేళ్ల నా సర్వీసులోకానీ, చదువుతున్నప్పుడు విన్న కేసుల్లోకానీ ఇలాంటి కేసు నా దృష్టిన పడలేదు. బహుశా భారతదేశంలోనే ఇలాటిది 'నభూతో న భవిష్యతి' కాబోలు!

తెలీదు. రేపటి ప్రపంచం మనకు ఎలాంటి వింతల్నీ, విడ్డూరాల్నీ ప్రసాదింపబోతోందో తెలిస్తే ఇక థ్రిల్ అనేది ఉంటుందా అసలు! కానీ జీవితాల్లోకి శాస్త్ర విజ్ఞానం దూసుకురావటం వల్ల జరుగుతున్న విషయాలు ఇవి! ఈ రోజున ఎంతో సంచలనం కలిగిస్తున్న ఈ కేసు కొన్నేళ్ల తర్వాత చరిత్రలో ఒక మామూలు సంగతిలా అయిపోవచ్చు. ఆ రోజు అసలు ఈ రోజు ఈ సంఘటనను ఇంతగా పట్టించుకొన్నామంటేనే ఆశ్చర్యం కలిగి తీరుతుందేమో!

కానీ... న్యాయం చెప్పటం అనేది కత్తి మీద సాము, ఈ సంగతి నాకు ఎవరూ కొత్తగా చెప్పనక్కరలేదు. క్షణక్షణమూ జాగ్రత్తగా చెవులతో విని, కనులతో కని, కనిపించని నిజాన్ని అన్వేషించి, ఇది నేను ఇస్తున్న తీర్పు అని చెప్తున్న సంఘటనలు ఎన్నో నా జీవితంలో ఉన్నాయి. కానీ ప్రతి కేసులో ఎక్కడో ఒక్కచోట దోషి ఎవరో నాకు కళ్లకు కట్టేవారు. దానితో కథలో చిక్కు విడిపోయి నాకు జరిగినదంతా స్పష్టంగా కనిపించేది. తీర్పు ఇవ్వటం అనేది ఆ తరవాత మామూలు సంగతి.

తీర్పు ఇచ్చేశాక ఇక ఆ సంగతి పెద్దగా పట్టించుకోనవసరం లేదు. కానీ.. ఈ కేసులో నేను రేపు ఇవ్వబోయే తీర్పు తర్వాత నేను జీవితాంతం ఆలోచిస్తూనే ఉంటాననేది నాకు ఇప్పుడే తెలుస్తోంది.

ఎవరికి చేయాలి న్యాయం? ఎవరిది తప్పనాలి?? ఏ నిర్దోషికైనా పొరబాటున అన్యాయం చేస్తున్నానా అనే భయం నాది.

ఆలోచిస్తూంటే... కేసు చరిత్ర నా కళ్ళ ముందు కదులుతూంటే... దోషిగా ఎవరూ కనపడటం లేదు.

కానీ... ఇలా న్యాయం కోసం వచ్చిన వారికి 'మీ ఇద్దరిలో ఎవరూ అన్యాయం చెయ్యనేలేదని నేను భావిస్తున్నాను' అని చెబితే, అది బహుశా ఇద్దరికీ అన్యాయం చేస్తున్నట్లే అవుతుంది.

ఏం చెయ్యను? ఏం చెప్పి ఈ చిక్కు విప్పను?

ఏ తీర్పు చెప్పి నాకు నేను న్యాయం చేసుకోగలను??

<u>రాజగోపాల్ :</u>

మొదటిసారి నేను ఆ అమ్మాయిని చూచినప్పుడు 'ఈమెను పెళ్ళి చేసుకొంటే బాగుండును' అనుకొన్నాను. అది బహుశా దుర్ముహూర్తం అయి ఉండాలి... ఛ... ఛ... కాదు, ఆ అమ్మాయి నా జీవితంలో ప్రవేశించడం నిజానికి నా అదృష్టం.

మార్కెట్‌లో తనను చూశాక నాకు తెలిసింది. ఇన్నేళ్లు నా అన్వేషణకు గమ్యం ఆమేనని! ఆ రోజు ఆమెకు తెలీకుండా ఆమెను అనుసరించాను. వాళ్ల ఇల్లు తెలుసుకున్నాను. మర్నాడు ఆ ఇంట్లో ఉండే అందరి గురించి తెలుసుకున్నాను. ఆ తర్వాత పెద్ద అవస్థేమీ పడలేదు. ఆ అమ్మాయి... పేరు మంజుల - ఒక కాలెండర్ తిరిగే సరికి నా ఇంటి దీపం అయింది.

కాలెండర్‌లో పేజీలు తిరుగుతున్నాయన్న సంగతి మాకు తెలిసే సరికి బాగా ఆలస్యం అయింది. చుట్టుపక్కల వాళ్ళు చెవులు కొరుక్కొంటున్నారన్న సంగతి తెలిసేసరికి మరికొంచెం కాలం అయింది.

ఆ రోజు సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చేసరికి మంజుల నా కోసం వేచి చూస్తోంది. కళ్ళు కొంచెం ఉబ్బి ఉన్నాయి. ఏడ్చిందనే దానికి వేరే సాక్ష్యం అక్కర్లేక పోయింది.

'ఏం జరిగింది?' అనడిగాను.

వెక్కిళ్లమధ్య మంజుల తన గోడు వెళ్లబోసుకొంది - తనకు మాతృత్వానికి అర్హత లేదని అందరూ అనుకొంటున్నారట!!

నాకు నవ్వొచ్చింది. పిచ్చితనం!

ఈ దేశంలో ఇందరు పిల్లలు ఉన్నారు.

ఇంత జనాభా ఉంది. అయినా ఈ జనాభా లెక్కల మొత్తపు సంఖ్యకు ఒక్కటి తక్కువ అయిందని వీరి బాధ కాబోలు! అదే అన్నాను.

అయినా మంజుల మర్నాడు నన్ను ప్రయాణం చేయించేంతవరకూ వదల్లేదు - వెళ్లాము. పరీక్షలన్నీ పూర్తయ్యాయి. అందరూ అనుకున్న దాన్ని డాక్టర్ నిజమని రుజువు చేసింది. మంజులకు పిల్లలు పుట్టరట!

డాక్టరును మార్చాము. వేరే డాక్టర్ దగ్గరకు వెళ్ళాము. కానీ ఫలితం మాత్రం మారలేదు. మంజుల పిల్లలు మాత్రం పుట్టరు!!

నాకు ఏడుపు వచ్చింది. అన్యాయం ఇది. దారుణం ఇది! నాకు, మంజులకు ఇంత శిక్ష విధించడం క్రూరం. ఆ భగవంతుడు ఎందుకిలా చేశాడో తెలియలేదు. నా ఆరోగ్యానికి, మంజుల ఆరోగ్యానికి ఏమీ కొదవ లేదు. ఇద్దరికిద్దరమూ సాటిలేని వాళ్ళలా కనిపిస్తాం.. కాదు, సాటిలేని వాళ్ళమే! చీకటి పడేసరికి పోట్లగిత్తల్లా... ఛీ... అయినా ఈ కోరిక తీరేది కాదు!! ఏం లోపం ఉంది! ఎక్కడ ఉంది??

మళ్ళీ పరీక్షలు... ఫలితం ఒక్కటే... మంజుల మాతృత్వ స్థానం పొందదనేది సారాంశం!

భరించలేకపోయాను ఆ నిజాన్ని - కానీ ఏం చేయను??

ఎన్ని కలలు - ఎన్ని కలలు కన్నాను - నా ఇంటి నట్టింట ఒక చిన్న దీపం కళకళలాడుతూ తిరగాలనీ, ఆ దీపపు వెలుగులు నా ఇంట పండగలు చేయాలనీ. ఎన్ని కలలు.... అన్నీ ఏమైపోతున్నాయి!

తల్లిగా మంజల కలలు కందోలేదో తెలీదు. కానీ ఆ కలలు నిజం కావటానికి ఒక బిడ్డను మాత్రం కనలేని స్థితిలో ఉంది.

నా కలలన్నిటిని ఛిన్నాభిన్నం చేస్తూ డాక్టర్లు చేసిన పరీక్ష ఫలితాలు...

రోజూ సాయంత్రం చిన్నగా చీకట్లు ముసురుకుంటుంటే మా ఇద్దరిలో ఏదో గిల్టీ కాన్షస్ తలెత్తేది. ఎన్ని అవస్థలు పడితేనేం, ఎన్ని రాత్రిళ్లు కలబోసుకుంటేనేం.. ఏం జరుగుతుందనే నిర్వేదం. గతంలో చీకటికోసం , ఒంటరితనం కోసం కళ్ళుకాయలు చేసుకుని బ్రతికిన మాకు ఇప్పుడు ఒంటరితనం అంటే భయం. కానీ మంజుల తప్పు ఇందులో ఏదీ లేదని నాకు తెలుసు - ఆమెను శిక్షించడం అనేది అర్థం లేని సంగతి. ఆమెను వదలి మరొకరిని వివాహం చేసుకుంటే సంతానం కలుగుతుందని డాక్టర్లు చెప్పారు. కానీ మంజులతో

కాక మరొకరితో నేను ఆ సుఖంపంచుకోగలనా? ఆ సుఖం పంచుకున్నాక కదా సంతానం కలిగేది! నేను ఆ పని చేయగలనా?

ఊహూ, మంజులతో కష్టాన్నే పంచుకుంటాను!! ఇంట్లో పిల్లలు తిరగాలనే కోరిక నన్ను ఎంతగా కోసేసినా సరే...

కానీ... ఆ రోజు మంజుల అన్నది విని పూర్తిగా షాక్ తినేశాను.

_మంజుల:_

నా సంగతి నాకు పూర్తిగా తెలిసిపోయింది. ఆయనతో నేను ఇన్నాళ్ళు కష్టసుఖాలు పంచుకోగలనని అనుకున్నాను. కానీ, నాకేం తెలుసు, విధి నాకు ఎదురు తిరుగుతుందని! ఆయన నాకు సుఖాల్ని పంచుతుంటే, నేను ఆయనకు ఏం అందిస్తున్నాను ప్రతిగా? ఆయన ప్రతిరూపాన్ని పది నెలలు మోసి, పండంటి పాపను కని, ఆయన చేతిలో పెట్టాలనేది నాలో అణువు అణువునా ఉన్న కోరికే, అయినా ఏం చేయను? మనసు నా వశంలో ఉంది కానీ, శరీరం ఎదురు తిరుగుతుంటే ఏం చేయగలను?

ఆయన కలలన్నీ విచ్ఛిన్నం అయిపోతుంటే, దానికి కారణం నేనని తెలిసి నా మనసు నన్ను క్షణక్షణం చంపేస్తుంటే... ఆలోచనలు నన్ను పలు రకాల దారుల్లోకి తీసుకెళ్లాయి.

ఆయనను వదిలి బతకటం నాకు సాధ్యం కాదు. వదలక ఆయన కోరికలు తీర్చటం నాకు చేతకాదు. ఆయన దారిలో నుంచి తప్పుకొని వేరొక స్త్రీకి ఆయన జీవితాన్ని పంచాలంటే, ముందు నా దారి నిర్ణయించుకోవాలి. ఏముంటుంది దారి? ఒకటే - ఆత్మహత్య చేసుకోవటం నాకు ఊహల్లో కూడా సరిపడదు.

కానీ, కథ ఇలా అసంపూర్తిగా, ఆయన కోరిక తీరనిదిగా ఉండిపోవటానికి వీలులేదు.

అందుకే ఆయనకు నా ఉద్దేశం చెప్పాను... తప్పా? అనుకుని..

స్వీటు తినాలి అని ఉంటే బజారులోకి వెళ్ళి మిఠాయి షాపులో కొనుక్కుంటున్నాం. వినోదం కావాలి అంటే సినిమా హాలుకి వెళ్ళి కోరిక తీర్చుకుంటున్నాం. అన్ని కోరికలూ తీరటానికి ఒక మార్గం ఉండే ఉంటుంది. ఉంది... ఈ కోరికా తీర్చుకోగలం.

ఎటొచ్చి ఆయన ఒప్పుకోవాలి ... అంతే.

ఆయనకు నచ్చచెప్పేసరికి నా తలప్రాణం తోకకు వచ్చింది. ఆయనకు నా మీద ఇంత ఇష్టం ఉందని నాకైతే తెలియదు. ఊహలకు అందలేనంత పిచ్చి ప్రేమ అది-- అందుకే తన కోరికలకు సైతం గోరీ కట్టడానికి సిద్ధపడ్డారాయన! అంత మాత్రాన ప్రతి నిమిషమూ నరకాన్ని పంచుకోవటం నాకు చేతకాదు.

ఆయనను నా దారిలోకి తీసుకురావటానికి ఎంత అవస్థపడ్డానో నాకు తెలుసు. ముందు ఎంత హోమ్ వర్క్ చేశానో ఆయనకు తెలియదు. 'పరిస్థితి ఇది - మీరు నాకిలా సాయం చేయండి!' అని ఎందరు డాక్టర్లను అడిగానో చెప్పలేను. కానీ, మొత్తానికి ఒక డాక్టరు ఒప్పుకున్నారు - మార్గమూ చెప్పారు.

ఎవరైనా ఒప్పుకునే వాళ్ళుంటే, ఆయన సంతానాన్ని కేవలం కొంతకాలం 'భరించి' ఇస్తే... సమస్య పరిష్కారం అయిపోతుంది.

కానీ... భర్తకాక ఎవరు భరిస్తారు? పర్వాలేదు. ప్రయత్నించండి అన్నాడు డాక్టర్. ఆ స్త్రీని, వెతికి పట్టుకుంటే, మీ భర్త దగ్గరకు తెస్తే ఇద్దరికీ ఏ సంబంధం లేకనే సంతానాన్ని పొందవచ్చునని చెప్పాడు డాక్టరు.

నా అన్వేషణ ఈ సారి ఆ స్త్రీ కోసం...

ఎక్కడుంది ఆమె? నాకోసం, నా భర్త సంతానాన్ని కొంతకాలం కడుపున పెట్టుకుని కాపాడి అప్పచెప్పే స్త్రీ...?

ఎక్కడ ఉంది??

<u>చంద్రిక:</u>

ఆమెను నేను మొదటిసారి కోర్టులో చూశాను. మామూలుగా జరగవలసిన తతంగం అంతా పూర్తయింది, 'నిన్న రాత్రి ఏం చేశావు?' అని అడిగాడు ఆ కోర్టులో పెద్దమనిషి. కేసు రెయిడింగ్ కేసు, ఏం చేస్తుంటాను? తెలియకే అడిగాడా ఆయన? తెలిసే ఉంటుంది. ఎప్పుడో ఒకసారి ఆయనా నా క్లయింట్ అయే ఉంటారు. ఇంతవరకూ కాకపోతే అవ్వాలనే ఆశతో ఉన్నట్లే ఉంది...

జడ్జి వేసిన ఫైను కట్టేశాను. నిన్న రాత్రి పొరపాటున దొరికిపోయాను. దొరికి పోవటమూ కాదది. పోలీసులతో మాకున్న అగ్రిమెంట్ అలాంటిది. పరస్పర సహకారం మా ధ్యేయం. నిన్న పోలీసులకు మా అవసరం పడింది.

ఆ చెట్టుకిందకు వచ్చేసరికి ఆవిడ నన్ను పిలిచింది. వెళ్ళాను-- ఆమె చూస్తే సంసార స్త్రీలాగే ఉంది. నాతో ఏం అవసరం వచ్చిందా అని ఆశ్చర్యపోయాను. ఆవిడ చెప్పింది విని షాక్ తినేశాను. డబ్బు ఆశ చూపించింది. ఎంత కావాలంటే అంత ఇచ్చే స్థోమత ఆమెకు ఉన్నట్లు లేదు. అయితేనేం, అంత ఇస్తాననటంలోనే ఆమె కోరికలో బలం నాకు కనబడింది.

ఏ కళన ఉన్నానో ఊ అన్నాను.

మర్నాడు ఇద్దరమూ డాక్టర్ దగ్గరకు వెళ్ళాము. పరీక్షలు జరిగాయి. నా ఆరోగ్యం సంగతి నాకు తెలుసు- మా వృత్తి నన్ను దెబ్బ తీసేది అయినా, ఆరోగ్యంగా ఉన్నంత కాలమే జీవనం అనే సంగతి తెలిసిన దాన్ని. అందుకే ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ రాత్రిళ్లు గడిపేదాన్ని.

డాక్టరూ నా ఆరోగ్యానికి వచ్చిన ఇబ్బంది ఏం లేదన్నాడు. ఆయన... మంజుల మొగుడు.. నన్ను తాకనైనా తాకలేదు. ఆయన బిడ్డకు నేను నా కడుపులో ఆశ్రయం ఇచ్చాను.

కొత్తదనం నా జీవితంలో అప్పుడే ప్రవేశించింది. తెలిసో, తెలియకో నేను మంచి పనే చేశాను. స్త్రీగా ఇన్నాళ్ళు నన్ను ఎందరో పురుషులు చూడటం, చవి చూడటం సైతం నాకు తెలుసు. కానీ నా స్త్రీత్వాన్ని ఇష్టపూర్వకంగా నేను అనుభవించగలగటంలో ఎంతో తృప్తిగా ఉంది నాకు!

నాలో లోపల పెరుగుతున్న బిడ్డ నా ఒంటినంతా ఆప్యాయంగా తడుముతోంటే ఎంత తృప్తి! నిజంగా అందరు స్త్రీలూ ఇంతటి ఆనందాన్ని పొందుతున్నారా? లేకపోతే మామూలు స్త్రీ జీవితం కోసం మనసు చాచే అర్రుల వల్లనే ఈ తృప్తి కేవలం నేను మాత్రమే అనుభవిస్తున్నానా?

తెలియదు. ఏదైతేనేం నా జీవితంలో రాదనుకున్న ఘట్టం రానే వచ్చింది. ఒక బిడ్డకు నా రక్తమాంసాలు పంచి ఇవ్వగలుగుతున్నానన్న తృప్తి నాలో అణువు అణువునా నిండిపోతోంది.

ఎంత గొప్పవరం ఈ మాతృత్వం! నేను ఆ వరం పొందగలగటం ఎంతటి అదృష్టం! ఆ రోజున మరో కళన ఉండిపోయి ఈ వరాన్ని కాలదన్నుకొని ఉంటే... వద్దు. ఆ దురదృష్టం నా జీవితంలోకి రాకపోవటం అదృష్టమే! డబ్బుకు ఆశపడే ఆ రోజున అంగీకరించిన మాట వాస్తవమే అయినా, ఎంత మంచి పని చేశాను నేను!!

అందరు స్త్రీలలానే నాకు మాతృస్థానం లభ్యమయిన రోజు నేను పొందిన ఆనందం చెప్పలేనిది!

కానీ ఆనందానికి, సంతోషానికి కూడా హద్దులు ఉంటాయి కాబోలు - బాబు పుట్టిన నాలుగు రోజులకే మంజుల, ఆమె భర్త వచ్చారు. బాబును ఇచ్చేయమంటూ!

నిజమే - ఒప్పందం ప్రకారం బాబును అందజేయాలి. నా డబ్బు పూర్తిగా తీసుకోవాలి. కానీ, బాబుకు నాకు మధ్య సంబంధం కేవలం డబ్బు పరమైనదేనా?

కాదు- కానే కాదు - ఎన్ని వేలిచ్చినా, ఎన్ని లక్షలు ఇచ్చినా నా బాబును నేను వాళ్లకు అప్పజెప్పలేను. 'అప్పజెప్పను కాక అప్పజెప్పను' అని చెప్పాను.

"ఇది మోసం" అన్నారు.

"దగా, అన్యాయం.." అంటూ ఎన్నో అన్నారు. విన్నారు. చివరకు కోర్టుకు వెళతాం అన్నారు.

"మీ ఇష్టం!" అన్నాను.

కోర్టునుంచి సమన్లు అందాయి.

పదినెలలపాటు ప్రాణంలో ప్రాణంగా చూసుకొన్న ఆ రక్తమాంసాల ప్రోవి నాదేనని కోర్టుముందు చెప్పుకున్నాను.

రేపు కోర్టువారు తీర్పు చెప్పాల్సి ఉంది... డబ్బు కక్కుర్తి అయితే కావచ్చు. కానీ మాతృత్వం అనేది దైవం అందించిన వరం. దాన్ని పదిలంగా పొందగలిగాను. ఇప్పుడు మాత్రం దేవుడు నా పక్షాన ఉండడా?

చూస్తాను.. రేపు నా జీవితంలో వెలుగే తెస్తుందో...

<u>జడ్జి జగన్నాథం</u>

మనసంతా అల్లకల్లోలంగా ఉంది. అందుకే ఇంకా తెల్లవారకుండానే మెలుకువ వచ్చేసింది.

తూర్పునుంచి వెలుగు రేఖల్ని వెదజల్లుకుంటూ వస్తున్న భానుడు నాలో చీకట్లనూ తొలగించాడు.

తీర్పు ప్రశాంతంగా వినిపించగలిగాను - "స్త్రీకి దేవుడు ఇచ్చిన వరం మాతృత్వం. అయితే అది పొందటానికి ఈమె అర్హత ఏమిటి అనేది వేరే సంగతి. కానీ బిడ్డకు కడుపులో స్థానం ఇవ్వగానే ఆమెకు అర్హత ఉందన్నది స్పష్టం అయింది. పుట్టిన బిడ్డకి సాంఘిక జీవనంలో తగినంత భద్రత లేనటువంటి, లేదా రేపు బిడ్డడి జీవితంలో సంఘర్షణ రేపగలిగేటువంటి విధంగా ఆ బిడ్డడి పుట్టుకకు కారణం అయిన డాక్టర్ నిజానికి ఈ కేసులో దోషి, పిల్లలు కలగక పోవటం మంజులలో ఉన్న నేరం కాదు. పిల్లల్ని పొందాలని మంజుల భర్త రాజగోపాల్ ఆశించటమూ నేరం కాదు! ఆ భార్యాభర్తల కోరిక తీర్చటానికి అంగీకరించిన డబ్బు మనిషి చంద్రికదీ తప్పుకాదు ఆ తర్వాత తన కడుపులో పెరుగుతున్న బిడ్డమీద ఎనలేని మాతృత్వపు మమకారం పెంచుకోవటం అనేది చంద్రిక చేసిన నేరమూ కాదు... కానీ.. బిడ్డ పుట్టక మునుపే, అసలు బిడ్డ పుట్టుకకు డబ్బుతో విలువ కట్టడం జరిగింది. నిజానికి ఈ కేసులో జరిగింది - ఒక బిడ్డ అమ్మకమూ, కొనుగోలూ!! ఇది మనం మనుషులుగా తలవంచుకోవాల్సిన సంగతి. అయితే తండ్రికన్నా తల్లికి ఆ బిడ్డమీద అధికారం అధికంగా ఉండటం అనేది ప్రకృతి ఇచ్చిన హక్కు. అందుకే - ఆ బాబు స్వయంగా నిర్ణయం చేసుకోగలిగే రోజు వచ్చేంతవరకూ బాబుపై అధికారం పూర్తిగా చంద్రికదే! అయితే బాబుకు సాంఘిక భద్రత, స్థాయి కల్పించవలసిన బాధ్యత మాత్రం రాజగోపాల్‌దే. ఆ బాబును ఎప్పుడు చూడాలన్నా, చూడగలిగే హక్కు రాజగోపాల్‌కు సర్వదా ఉంటుంది..."

జడ్జిమెంట్ ఇంకా పూర్తి కాకమునుపే చంద్రిక ఆ బాబును హత్తుకోవటం చూస్తూంటే నా నిర్ణయం సరైనదేనని నా అంతరాత్మ నాకు చెబుతూనే ఉంది. ఆమె జీవితంలో విరుస్తున్న వెన్నెల్లు రాజగోపాల్, మంజుల దంపతుల జీవితాల్లో చీకటి నింపుతున్న సంగతీ నాకు తెలుస్తూనే ఉంది!

*- ఆంధ్రప్రభ, సచిత్రవారపత్రిక, 1 జనవరి 1979*